# బలగం BALAGAM TV

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 08 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బదిలీ..!

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే బదిలీకానున్నారు. ఆయనను బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం మంగళవారం కేంద్ర న్యాయశాఖకు సిఫారసు చేసింది. పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కే వినోద్ చంద్రన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి కల్పించాలని కోరింది. బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ్‌ను ఢిల్లీ హైకోర్టుకు, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధేను బాంబే హైకోర్టుకు బదిలీ చేయాలని సిఫారసు చేసింది.

జస్టిస్ అలోక్ అరాధే గతేడాది జులైలో నియామకమయ్యారు. సీజేగా ఉన్న జస్టిస్ ఉజ్జల్ భుయాన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జస్టిస్ అలోక్ అరాధేను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై తెలంగాణ హైకోర్టు సీజేగా బాధ్యతలు స్వీకరించారు.



### మార్చి వరకు

# డీపీఆర్‌లు పూర్తి చేయాలి

- శామీర్‌పేట్-మేడ్చల్ వద్ద భారీ జంక్షన్ ఏర్పాటు
- హెచ్‌జీసీఎల్ కింద రేడియల్ రోడ్లు : సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఫ్యూచర్ సిటీ, శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రో మార్గాలకు సంబంధించిన సమగ్ర వివరణాత్మక ప్రణాళికలు (డీపీఆర్‌లు) మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు మెట్రోల డీపీఆర్‌లకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం పొంది ఏప్రిల్ నెలాఖరుకు టెండర్లు పిలవాలని సీఎం సూచించారు.

హైదరాబాద్ నగరంలో మెట్రో (%వీవ్‌తీశ్%) విస్తరణ, రేడియల్ రోడ్ల నిర్మాణాలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం – ఫ్యూచర్ సిటీ మెట్రో (40 కి.మీ.), జేబీఎస్ – శామీర్‌పేట మెట్రో (22 కి.మీ.), ప్యారడైజ్ – మేడ్చల్ మెట్రో (23 కి.మీ.) మార్గాలకు సంబంధించి భూ సేకరణను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు అధికారులకు పలు సూచనలు చేశారు.

ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలి. ఎలైన్‌మెంట్ రూపొందించేటప్పుడే క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన చేయాలి. మేడ్చల్ మార్గంలో ఎన్‌హెచ్ మార్గంలో ఇప్పటికే ఉన్న మూడు ఫ్లైఓవర్లను దృష్టిలో ఉంచుకొని మెట్రో లైన్ తీసుకెళ్లాలి. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలి. శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రోలు ఒకే చోట ప్రారంభమయ్యేలా చూసుకోవాలి. అక్కడ అధునాతన వసతులు, భవిష్యత్ అవసరాలకు తగినట్లు భారీ జంక్షన్ ఏర్పాటు చేయాలి. జంక్షన్‌కు సంబంధించిన పూర్తి ప్రణాళికను తయారు చేయాలి. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ కింద రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలి. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ VS బీజేపీ

- ఎంపీ ప్రియాంక గాంధీపై బీజేపీ నేత రమేశ్ బిధూరీ వ్యాఖ్యలపై బీజేపీ ఆఫీస్ ఎదుట యూత్ కాంగ్రెస్ నిరసన
- చలో గాంధీభవన్‌కు బీజేపీ పిలుపుతో ఉద్రిక్తం
- ఇరు పార్టీల నేతల మధ్య బాహాబాహీ, కార్యకర్తలకు గాయాలు
- ఇరు పక్షాలను చెదరగొట్టిన పోలీసులు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ప్రియాంక గాంధీపై ఢిల్లీ బీజేపీ నేత అనుచిత వ్యాఖ్యలు చేశాడని హైదరాబాద్ బీజేపీ ఆఫీస్ ముట్టడికి కాంగ్రెస్ శ్రేణులు. యత్నించారు. దీనికి నిరసనగా గాంధీభవన్ ముట్టడికి బీజేపీ యత్నించింది. ఈ క్రమంలో నగరంలో మంగళవారం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

కాంగ్రెస్ నేత, ఎంపీ ప్రియాంక గాంధీపై దిల్లీకి చెందిన బీజేపీ నేత రమేశ్ బిదూరీ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించేందుకు చేసిన యత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు గాంధీ భవన్ నుంచి ర్యాలీగా బీజేపీ కార్యాలయం వరకు వెళ్లి ముట్టడించాలని యువజన కాంగ్రెస్ భావించింది. దీంతో పోలీసులు పెద్ద సంఖ్యలో గాంధీ భవన్ వద్ద మోహరించారు. దాంతో కొందరు యువజన కాంగ్రెస్ నాయకులు నేరుగా నాంపల్లిలోని బీజేపీ కార్యాలయ ముట్టడికి వచ్చారు. అక్కడ ఉన్న బీజేపీ కార్యకర్తలు ఎదురు దాడి చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ కార్యాలయంపైకి రాళ్లు విసిరారు. దీంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. కార్యాల యంపై రాళ్లు విసరడంతో ఒక బీజేపీ కార్యకర్త తలకు గాయమైంది. బీజేపీ శ్రేణులు కర్రలతో కాంగ్రెస్ కార్యకర్తల వెంటపడ్డారు. పెద్ద ఎత్తున పోలీసులు మోహరించి ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టారు.



ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందిస్తూ, రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దాడిని దురదృష్ట కరంగా అభివర్ణిస్తూ, ప్రభుత్వ వైఫల్యాన్ని బహిర్గతం చేస్తున్నారు.

**గాంధీభవన్ ముట్టడికి బీజేపీ యత్నం**

బీజేపీ ఆఫీసుపై దాడి అనంతరం, బీజేపీ కార్యకర్తలు గాంధీభవన్‌ను ముట్టడించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కానీ పోలీసులు అప్రమత్తమై బీజేపీ శ్రేణులను అడ్డుకోవడంతో, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో, బీజేపీ కార్యకర్తలు రాళ్ల దాడి చేస్తుండగా, పోలీసులు వారిని నియంత్రించేందుకు లాఠీచార్జ్ చేశారు. పలువురిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## ప్రభుత్వం ఏం చేస్తోంది : కేంద్ర మంత్రి బండి సంజయ్



బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడం పట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ పది మంది కార్యకర్తలు వచ్చి దాడులు చేస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. తమ పార్టీ కార్యకర్తలు తలుచుకుంటే గాంధీభవన్ తో పాటు కాంగ్రెస్ కార్యాలయాల పునాదులు కూడా మిగలవన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అధికార పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడులు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తల సహనాన్ని చేతకానితనంగా భావించొద్దని ఓ ప్రకటనలో బండి సంజయ్ తెలిపారు. తప్పుడు వ్యాఖ్యలు ఎవరూ చేసిన ఖండించాల్సిందేనని, చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలే కాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని భయపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు.

## క్షణికావేశంలో కాంగ్రెస్ నాయకులు దాడి చేశారు : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఖమ్మంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. “క్షణికావేశంలో పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు భాజపా కార్యాలయంపై దాడి చేశారని తెలుసుకున్నాను. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో మాట్లాడాను. విషయం తెలియగానే సీఎం, పీసీసీ అధ్యక్షుడు కూడా ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా చాలా స్పష్టంగా చెప్పారు. మనది గాంధేయ వాదం.. దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ సంస్కృతి కాదన్నారు. దాడులనూ కాంగ్రెస్ ప్రోత్సహించదు. లా అండ్ ఆర్డర్ విషయంలో ఎవరైనా ఒక్కటే. ఏ పార్టీ అయినా సరే.. ఎక్కడైనా అన్యాయం జరుగుతుందనిపిస్తే ప్రజల్లోకి వెళ్లాలి.. అభిప్రాయాలు వ్యక్త పరచాలి. ఇలాంటి దాడులకు మాత్రం దిగొద్దు. విషయం తెలుసుకోకుండా బీజేపీ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు. పార్లమెంట్ సభ్యురాలు, ఒక మహిళపై బీజేపీ నేత ఇష్టానుసారం మాట్లాడితే.. బీజేపీ అగ్రనాయకత్వం ఏం చేస్తోంది? అసభ్యంగా మాట్లాడిన బీజేపీ నేతను ఇప్పటికే పార్టీ నుంచి సస్పెండ్ చేయాల్సింది” అని వ్యాఖ్యానించారు.

# కేటీఆర్‌కు షాక్

- ఫార్ములా ఈ రేస్‌పై క్వాష్ పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు
- సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- రాష్ట్ర ప్రభుత్వం కేవియట్ పిటిషన్ దాఖలు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్)కు హైకోర్టులో షాక్ తగిలింది. ఫార్ములా ఈ–రేస్ వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును ఎత్తివేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు మంగళవారం తుది తీర్పు వెలువరించింది. ఏసీబీ అరెస్టు చేయకుండా 10 రోజులు అమల్లో ఉండేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కేటీఆర్ లాయర్ గండ్ర మోహన్‌రావు చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చింది. ఇలాంటి కేసుల్లో దర్యాప్తును అడ్డుకునేందుకు ఆస్కారం లేదని చెప్పింది. కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ కె.లక్ష్మణ్ కొట్టివేస్తూ కీలక తీర్పు వెలువరించారు. దీనిపై కేటీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్‌ను దాఖలు చేసింది.

‘ఫార్ములా రేస్ నిమిత్తం ప్రభుత్వం, ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్‌ఈఓ), ఏస్ నెక్స్‌జెన్ ప్రయివేటు లిమిటెడ్ మధ్య ఒప్పందం కుదిరింది. సీజన్ 9 సమర్థవంతంగా నిర్వహించాక పదో సీజన్‌కు ప్రమోటర్ వెళ్లిపోవడంతో ప్రభుత్వమే చెల్లింపులు జరిపి రేస్ నిర్వహణకు అగ్రిమెంట్ కుదిరింది. ఇప్పటికే ఉన్న ఒప్పందం అమల్లో భాగంగానే రెండో అగ్రిమెంట్ జరిగింది. అది ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా జరిగిందని అభియోగం. 2023కు చెందిన బకాయిల చెల్లింపులూ జరిగాయి. కొత్త ఒప్పందాన్ని ప్రభుత్వం అమలు చేయకపోవడంతో ఈ వివాదం అంతర్జాతీయ స్థాయిలో అర్బిట్రేషన్ పరిధిలోకి వెళ తుందని నాటి పాలకులు భావించారు.

రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా కేసు నమోదైంది. ఈ కేసు నమోదు 14 నెలల ఆలస్యంగా చేయడాన్ని తీవ్రంగా పరిగణించాలి. లలిత కుమారి, చరణ్‌సింగ్ కేసుల్లో సుప్రీంకోర్టు జారీ చేసిన తీర్పులకు విరుద్ధంగా కేసు నమోదు తీవ్ర జాప్యమైంది. ఆ కేసుల్లో సుప్రీం కోర్టు మూడు నెలల జాప్యానికే ఒప్పుకోలేదు. ఇక్కడ అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(1)(ఎ) కింద కేసు నమోదు చెల్లదనీ పిటిషనర్‌కు 41ఎ నోటీసులు జారీ చేయకుండా ఉండేందుకే ఐపీసీ 409, 405, పీసీ యాక్ట్ 13(1)(ఎ) వంటి సెక్షన్లను నమోదు చేశారు. నిధుల చెల్లింపులు, అంతకముందు అగ్రిమెంట్లు, అన్నీ డాక్యుమెంట్స్ ప్రభుత్వం దగ్గరే ఉన్నాయి. నిధులు పొందిన వాళ్లను వదిలేసి పైసా కూడా తీసుకోని తనను నిందితుడిగా చేర్చడం రాజకీయ కుట్రలో భాగమే. నిధులను సొంతానికి వినియోగించుకోలేదు. ప్రమోటర్ నిందితునిగా లేనప్పుడు ఐపీసీ 120 బి కింద కుట్ర జరిగిందనే అభియోగాన్ని ఎలా మోపుతారని ప్రశ్నించారు. ప్రభుత్వ విధాన నిర్ణయంలో భాగంగానే ఇవన్నీ జరిగాయి. విధాన నిర్ణయాల్లో లోటుపాట్లు ఉంటే వాటిని ప్రభుత్వమే సరిదిద్దుకోవాలి. ఆ నాటి మంత్రి తీసుకున్న నిర్ణయమని చెప్పి తనపై కేసు నమోదు చట్ట వ్యతిరేకం’ అని కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది.

ఫార్ములా ఈ–కార్ రేసు కేసులో హైకోర్టు తన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేయడంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేటీఆర్ తరఫు న్యాయవాది మోహిత్ రావు సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో పిటిషన్ దాఖలు చేశారు. ఇదిలా ఉండగా హైకోర్టు క్వాష్ పిటిషన్ కొట్టివేయడంతో కేటీఆర్ సుప్రీంకోర్టుకు వెళతారని వార్తలు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం ముందే కేవియట్ దాఖలు చేసింది. కేటీఆర్ కనుక సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తమ వాదనలు కూడా వినాలని ఈ పిటిషన్ లో కోరింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో కేటీఆర్ లీగల్ టీంతో భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో గల తన నివాసంలో ఆయన సమావేశమయ్యారు. ఏం చేయాలనే అంశంపై చర్చించారు. అనంతరం సాయంత్రం గం.4.40కి సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ బుధవారం విచారణకు వచ్చే అవకాశముంది.

# టిబెట్‌లో భూకంపం

## 126 మంది మృతి

- 6.8 తీవ్రతతో భూకంపం
- 188 మందికి తీవ్రగాయాలు
- భారత్‌లోనూ పలు చోట్ల కంపించిన భూమి



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

నేపాల్–టిబెట్ సరిహద్దులను వణికించిన భారీ భూకంపంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ విపత్తు కారణంగా టిబెట్‌లో ఇప్పటివరకు కనీసం 126మంది మృతిచెందినట్లు చైనా అధికారిక మీడియా సంస్థ పేర్కొంది. మరో 188 మందికి గాయాలైనట్లు వెల్లడించింది. అయితే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చైనాలోని టిబెట్ అటానమస్ రీజియన్‌లోని జిగాజ్ నగరంలో మంగళవారం ఉదయం 6.8 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీనితో పలు భవనాలు నేలమట్టమయ్యాయి. శిథిలాల కింద పలువురు చిక్కుకున్న వారిని రక్షించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పశ్చిమ చైనాలో, నేపాల్? సరిహద్దుకు సమీపంలోని టిబెట్ రీజియన్?లోని పర్వత ప్రాంతాల్లో దాదాపు 10 కిలోమీటర్ల లోతులో 6.8 తీవ్రతతో భూకంపం సంభవించిందని చైనా ఎర్త్‌క్వేక్ నెట్‌వర్క్ సెంటర్ తెలిపింది.

నేపాల్–టిబెట్ సరిహద్దుకు 93 కి.మీ దూరంలో ఉన్న లబుచె ప్రాంతంలో మంగళవారం ఉదయం 6.35 గంటలకు ఈ భూకంపం సంభవించింది. దీని తీవ్రతతో నేపాల్ రాజధాని కాఠ్‌మాండూ సహా పలు జిల్లాల్లో ప్రకంపనలు వచ్చాయి. దీంతో పలు భవనాలు నేలమట్టమయ్యాయి. శిథిలాల కింద పలువురు చిక్కుకున్న వారిని రక్షించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

పశ్చిమ చైనాలో, నేపాల్? సరిహద్దుకు సమీపంలోని టిబెట్ రీజియన్ లోని పర్వత ప్రాంతాల్లో దాదాపు 10 కిలోమీటర్ల లోతులో 6.8 తీవ్రతతో భూకంపం సంభవించిందని చైనా ఎర్త్‌క్వేక్ నెట్‌వర్క్ సెంటర్ తెలిపింది. ఖుంబు హిమాలయ శ్రేణిలో లోబుట్సేకు 90 కి.మీ దూరంలో ఉన్న చైనాలోని టింగ్రి కౌంటీలోని జిజాంగ్ కేంద్రంగా భూకంపం సంభవించినట్లు గుర్తించారు. భారత్, అమెరికాలు ఈ భూకంప తీవ్రతను 7.1గా పేర్కొన్నాయి.

నేపాల్‌లో మంగళవారం ఉదయం రిక్టర్ స్కేలుపై 4, 5 తీవ్రతతో కనీసం అరడజను సార్లు భూమి కంపించింది. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే భూకంపం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు ఎలాంటి సమాచారం లేదని అక్కడి అధికార వర్గాలు తెలిపాయి.

భూకంప తీవ్రత ఉత్తర భారతాన్ని కూడా తాకింది. ఢిల్లీ ఎన్సీఆర్, బెంగాల్, బీహార్, అస్సాం, పశ్చిమబెంగాల్‌తోపాటు పలు ప్రాంతాల్లోనూ ప్రకంపణలు సంభవించాయి. బీహార్‌లో ఆందోళనకు గురైన ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వచ్చారు. ఇక చైనా, భూటాన్, బంగ్లాదేశ్‌లోనూ భూమి కంపించింది. భారీ భూకంపం ధాటికి పలుచోట్ల ఎత్తైన భవనాలు నేలకూలాయి. రంగంలోకి దిగిన రెస్క్యూ సిబ్బంది శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని వెలికితీస్తున్నారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక మీడియా పేర్కొంటోంది.



# న్యాయ పోరాటం చేస్తా

- ఈ పస లేని కేసు డైవర్షన్ పాలిటిక్స్ లో భాగమే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగం ఇచ్చిన హక్కును వాడుకుంటానని.. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన కేసుపై ధైర్యంగా న్యాయపోరాటం చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. హైదరాబాద్ నందినగర్‌లోని నివాసం వద్ద మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తీరుపై ఆయన విరుచుకుపడ్డారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ‘దయచేసి ఎవరూ ఆగం కావొద్దు. ముఖ్యమంత్రి నోట్లో నుంచి వచ్చేవి వేదవాక్కులువు కావు. సీఎం ఆఫీస్ నుంచి వచ్చేవి లీకులు మాత్రమే భగవద్గీత సూక్తులు కావు. మేం అసెంబ్లీలో చర్చ పెట్టాలని అడిగితే.. సీఎం రేవంత్ పారిపోయిండు. నాలుగు కోట్ల ప్రజల ముందు చర్చ పెడదాం రా నాయన అంటే రాలేదు’ అన్నారు.

‘ఇప్పుడు కూడా అడుగుతున్నా. రేవంత్‌రెడ్డి మొగోడివైతే నీ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో చర్చపెట్టు. టీవీల్లో లైవ్ పెడితే నేను వస్తా. ఎవరెందో ప్రజలు చూడనివ్వండి. ఆ తర్వాత ఏసీబీని పంపుతవా..? ఈడీని పంపుతవా? ఇంకోటి పంపుతవా? దానికి కూడా హాజరవుతాను. నాకు అభ్యంతరం లేదు. కానీ, నేను తప్పు చేయలేదు. అనాపైస అవినీతి చేయలేదు. కాబట్టి ఆ ధైర్యంతోనే న్యాయస్థానాల్లో న్యాయపోరాటం చేస్తాను. ఉదయం నుంచి మా నాయకులు వందలాది మంది నియోజకవర్గాల నుంచి వచ్చారు. వారందరికీ ధన్యవాదాలు. వారందరికీ ఒకటే చెప్పాను. వాటిని పట్టించుకోవద్దని చెప్పాను. వాళ్ల ఇంట్రెస్ట్ ఫార్ములా–ఈ. మా ఇంట్రెస్ట్ ఫార్మర్. మేం రైతు భరోసా గురించే మాట్లాడుతాం. డైవర్షన్ కోసం ఏం చేస్తున్నవో మాక తెలుసు. నీకు తెలిసిందే డిస్ట్రక్షన్, డిట్రాక్షన్, డిసెప్షన్ మాత్రమే తెలుసు. విధ్వంసం, అటెన్షన్ డైవర్షన్, మోసం కాంగ్రెస్ నైజం’ అని ధ్వజమెత్తారు.

‘ఇవాళ రైతులు 70లక్షల మంది రైతులు మాకు రైతు భరోసా అని ఎదురుచూస్తున్నారు. కేసీఆర్ సార్ 12 సార్లు రైతుబంధు ఇచ్చారు. చిట్టినాయుడు ఒకసారి కూడా ఇవ్వలేదు. ఈ సారైనా ఇస్తారా? మాట నిలుపుకుంటడా అని తెలంగాణ రైతులు కండ్లుకాయలు కాసేటట్టుగా చూస్తున్నారు. వాళ్లకు న్యాయం జరిగేందుకు కొట్లాడాలని మా నాయకులకు చెప్పాను. నా గురించి మరిచిపోండి.. న్యాయపోరాటం చేస్తానని చెప్పాను. నేను తప్పు చేయలేదు. ఆయన నన్ను ఏం చేయలేడు. ఆయన ఎన్ని రకాలుగా కక్ష్య సాధింపు ప్రయత్నాలు చేసినా ఏం సాధించలేడు.. శోధించలేడు. మీరు రైతుల సబ్జెక్టుపై మాత్రమే మాట్లాడండి అని ప్రతి నాయకుడికి చెప్పాను. పార్టీ నిర్మాణంపై, ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం ఫెయిల్ అయిన విధానంపై దృష్టి పెట్టండి అని చెప్పాను. అటెన్షన్ డైవర్షన్ గేమ్ ఏదైతే కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతుందో.. ఆ కాంగ్రెస్ పార్టీని, చిట్టినాయుడి పూర్తి స్థాయిలో బండారాన్ని బయటపెట్టి బజారులో ప్రజల ముందు ఎండగట్టండి. ఆడబిడ్డలకు ఇస్తానన్న రూ.2500, రూ.4వేల పెన్షన్‌పై నిలదీద్దాం.. ఆ దిశగా కార్యాచరణ చేద్దాం తప్పా.. పొరపాటు కూడా ఈ కేసు విషయంలో మీడియా హడావుడి.. చిట్టినాయుడి లీకులకు ఆగం కావొద్దు’ అన్నారు.

## ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

- 8న కౌంటింగ్
- షెడ్యూల్‌ను ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం
- 70 స్థానాలకు ఒకే ఫేజ్‌లో పోలింగ్

వివరాలు 2వ పేజీలో

## “భారత్ పోల్” పోర్టల్ ప్రారంభం

- కేసుల సత్వర విచారణకు
- కొత్త పోర్టల్ ప్రారంభించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

వివరాలు 2వ పేజీలో

# ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు




**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 23తో ప్రస్తుత అసెంబ్లీ గడవు ముగుస్తుండటంతో మంగళవారం ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం కోసం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఢిల్లీ అంతటా ఒకే విడతలో ఫిబ్రవరి 5న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నట్లు పేర్కొంది. జనవరి 10న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. జనవరి 17 వరకు నామినేషన్‌లు స్వీకరించనున్నారు. జనవరి 20 వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. షెడ్యూల్ విడుదల సందర్భంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. ఈవీఎంలపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంపై క్లారిటీ ఇచ్చారు.

ఓటర్ లిస్ట్ ట్యాంపరింగ్ జరిగిందన్న ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపింది. ఈవీఎంలను ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని స్పష్టం చేసింది. గత ఏడాది ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేసింది. దేశంలో ఓటర్ల సంఖ్య 99 కోట్లు దాటిందని, మహిళా ఓటర్ల సంఖ్య 48 కోట్లు దాటిందని సీఈసీ రాజీవ్ కుమార్ చెప్పారు. ఈ ఏడాది తొలి ఎన్నికలు ఢిల్లీలో జరగబోతున్నాయని అన్నారు. ఢిల్లీలో అన్ని ప్రాంతాల ఓటర్లు ఉంటారని పేర్కొన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ ఆరోపణలు సీఈసీ రాజీవ్‌కుమార్ ఖండించారు. ఈవీఎంలతోనే ఫలితాలు పారదర్శకంగా ఉంటాయని, ఈవీఎంల రిగ్గింగ్ జరిగినట్లు ఇంతవరకు ఎక్కడా నిరూపణ కాలేదని ఆయన తెలిపారు. ఈవీఎంల రిగ్గింగ్ సాధ్యం కాదని చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా ఇదే తనకు చివరి ప్రెస్ మీట్ అని సీఈసీ చెప్పారు. ఓటింగ్ శాతంపై కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తుండటంపై కూడా సీఈసీ స్పందించారు. పోలింగ్ రోజు సాయంత్రం 6 గంటలకు కచ్చితమైన పోలింగ్ శాతం వెల్లడించడం సాధ్యం కాదని అన్నారు.

**చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా ఇదే నా చివరి ప్రెస్ కాన్ఫరెన్స్ : రాజీవ్ కుమార్**

కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కీలక ప్రకటన చేశారు. సీఈసీగా ఇదే నా చివరి ఎన్నికల మీడియా సమావేశమని వ్యాఖ్యానించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా త్వరలోనే పదవీకాలం ముగియబోతుందని పేర్కొన్నారు. రాజీవ్ కుమార్ ఈ ఏడాది ఫిబ్రవరిలో పదవీ విరమణ చేయనున్నారు. %రాజీవ్ కుమార్ 15 మే 2024న రాజీవ్ కుమార్ 25వ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. సెప్టెంబర్ 1 సెప్టెంబర్ 2020 నుంచి ఎన్నికల కమిషన్‌గా ఎన్నికల సంఘంతో అనుబంధం ఉంది. ఆయన ఎన్నికల కమిషనర్‌గా ఉన్న సమయంలో 2020లో బీహార్ రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు జరిగాయి. కోవిడ్ సమయంలోనూ ఉత్తరప్రదేశ్ సహా మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్‌తో సహా పలు రాష్ట్రాల్లో ఎన్నికలు నిర్వహించారు. అలాగే, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల తో పాటు లోక్‌సభ, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను రాజీవ్ కుమార్ హయాంలోనే జరిగాయి.

# “భారత్ పోల్ ”పోర్టల్ ప్రారంభం

- కేసుల సత్వర విచారణకు
- కొత్త పోర్టల్ ప్రారంభించిన కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా




**బలగం టీవి, న్యూఢిల్లీ**

కేసుల సత్వర విచారణ కోసం కేంద్ర ప్రభుత్వం సరికొత్త వ్యవస్థను ఆవిష్కరించింది. భారత్ పోల్ పేరిట తీసుకొచ్చిన పోర్టల్‌ను మంగళవారం కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా ప్రారంభించారు. కేసుల విషయంలో కొత్త శకం ప్రారంభమైనట్టేనని ఈ సందర్భంగా మంత్రి అభివర్ణించారు. దర్యాప్తు సంస్థలు సరికొత్త సాంకేతిక పద్ధతులను ఉపయోగించుకొని పరారీలో ఉన్న నేరగాళ్లను అదుపు లోకి తీసుకు నేందుకు ఇది ఉపకరించనుంది. ఏజెన్సీలు వేగవంతంగా అంతర్జాతీయ పోలీసుల సహకా రం తీసుకునేందుకు సీబీఐ సహకారంతో దీనిని అభివృద్ధి చేశారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన దర్యాప్తు సంస్థలు ఇంటర్‌పోల్‌తో సులువుగా కనెక్ట్ అయ్యేందుకు ఇది వీలు కల్పిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఎదుర్కొంటున్న సవాళ్లను గమనించి, మన వ్యవస్థల్లో మార్పులు చేసుకోవాల్సిన , ఆధునిక సాంకేతికతలను ఉపయోగించాల్సిన సమయం ఇది. ఆ దిశగా భారత్ పోల్ అనేది ఒక అడుగు. ” అని అమిత్‌షా వెల్లడించారు. ఈ కొత్త వ్యవస్థతోపాటు మూడు నేర చట్టాల గురించి రాష్ట్రాలకు శిక్షణ ఇచ్చే బాధ్యతను సీబీఐ తీసుకోవాలని ఈసందర్భంగా కోరారు.

## బస్తీ దవాఖానలో మందుల కుంభకోణం..

- నిజామాబాద్‌లో ఎమ్మెల్యే తనిఖీల్లో బయటపడ్డ వైనం

**బలగం టీవి, నిజామాబాద్**



బస్తీ దవాఖానాలో రోగులు రాకున్నా వచ్చినట్టు వైద్య సేవలతో పాటు మందులు అందజేసినట్టు రికార్డులో నమోదు చేసిన ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. దవాఖానకు రోగులు రాకున్నా ఇతరుల పేర్లు తప్పుగా రికార్డులో నమోదు చేసి మందులు స్వాహా చేస్తున్న తతంగం ఎమ్మెల్యే ఆకస్మికంగా బస్తీ దవాఖాన తనిఖీ చేయడంతో వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ నగరంలోని 34వ డివిజన్ లోని మిర్చి కాంపౌండ్ లోని బస్తీ దవాఖానాను మంగళవారం అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూరనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానలోని రికార్డులో ఓపీ సేవలను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రతిరోజు సుమారు 80మంది రోగులకు వైద్య సేవలు అందజేయడంతో పాటు మందులు అందజేసినట్టు రికార్డులు నమోదు చేశారు. రికార్డులో నమోదు చేసిన రోగులకు స్వయంగా ఎమ్మెల్యే ఫోన్ చేయగా తాము నిజామాబాద్ ప్రాంతా నికి చెందిన వారము కాదని చెప్పడంతో ఎమ్మెల్యే కంగుతిన్నారు. ఈ ఘటనపై బస్తీ దవాఖాన వైద్యురాలిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులు రాకుండా వచ్చినట్టు తప్పుగా రికార్డు నమోదు చేయడమే కాకుం డా ఆసుపత్రికి వచ్చిన రోగులను పట్టించుకోక పోవ డం ఏమిటి అని ప్రశ్నించారు. బస్తీ దవఖానలో విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్వయంగా ఎమ్మెల్యే డీఎంహెచ్ఓ కు ఫోన్ లో ఆదేశించారు.

## కేటీఆర్ నిజాయితీ నిరూపించుకో

- ఎంపీ రఘునందన్ రావు

**బలగం టీవి, హైదరాబాద్**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తప్పు చేసారని ప్రజలు, ప్రభుత్వం, పోలీసులు నమ్ముతున్నారని, ఆయన తప్పు చేయలేదని భావిస్తే ఏసీబీ, ఈడీ ఎదుట హాజరై ఆధారాలు ఇచ్చి నిజాయతీ నిరూపించుకోవాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. లొట్టపిసు కేసుకు కేటీఆర్ చలిజ్వరం వచ్చినట్లు భయపడిపోతున్నారని, హైకోర్టు కూడా క్వాష్ పిటిషన్ కొట్టేసింది.. కాబట్టి కేటీఆర్ విచారణకు సహకరించాలని ఆయన సూచించారు. న్యాయవాదులు వెంట లేకపోతే విచారణకు రానని కేటీఆర్ అనడం సరికాదని, విదేశాల్లో వందల చానెళ్ల పెట్టించి.. కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ తనకు అన్యాయం జరుగుతోందని కేటీఆర్ ప్రచారం చేయించుకున్నారని రఘునందన్ రావు ఆరోపించారు. గత ప్రభుత్వంలో మంచి వాళ్లు అయిన పోలిసోళ్ళు ఇప్పుడు చెడ్డ వాళ్ళు అయ్యారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఏ తప్పు చేయని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎంపిలపై కేటీఆర్ అక్రమంగా కేసులు పెట్టి అరెస్ట్ చేయించారన్నారు. జైలుకు వెళ్లి యోగ చేస్తానన్న కేటీఆర్ ఓ సారి జైలుకెళ్లి చూసిరావాలని రఘునందన్ రావు సూచించారు.

# హైదరాబాద్‌కు సమానంగా వరంగల్ అభివృద్ధి

- మంత్రి పొంగులేటి

**బలగం టీవి, వరంగల్**

హైదరాబాద్‌కు సమానంగా వరంగల్ అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని రాష్ట్ర రెవెన్యూ , సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎక్స్ వేదికగా ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వరంగల్ ప్రాముఖ్యతను సీఎం రేవంత్ రెడ్డి గుర్తించారన్నారు. హైదరాబాద్ స్థాయిలో వరంగల్‌ను తీర్చిదిద్దడంలో భాగంగా మొదటి సంవత్సరం పూర్తి కాకముందే సీఎం రేవంత్ రెడ్డి రెండు పర్యాయాలు వరంగల్ పట్టణానికి వచ్చారని గుర్తుచేశారు. మొదటిసారి పర్యటన సందర్భంగా చేయాల్సిన అభివృద్ధిపై స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి అభిప్రాయాలను తీసుకున్నారన్నారు. ఎయిర్ పోర్ట్, వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్, కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ లను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నాకు బాధ్యతలు అప్పగించారని తెలిపారు. రెండో పర్యాయం వచ్చినప్పుడు అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారని, రూ. ఆరు వేల కోట్ల నిధులను మంజూరు చేశారని గుర్తు చేశారు. 2041 మాస్టర్ ప్లాన్ మంజూరు చేయడం జరిగిందని, భద్రకాళి చెరువు పూడికతీత, వివిధ అభివృద్ధి, మౌలిక వసతులు కల్పన టెండర్లు పిలిచామని పొంగులేటి పేర్కొన్నారు.

ఈ సంవత్సరం తెలంగాణ వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ల చొప్పున మంజూరు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రానున్న నాలుగు సంవత్సరాల్లో అర్హులందరికీ గృహాలను నిర్మించే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారిలో అత్యంత నిరుపేదలను పారదర్శకంగా గుర్తించి, వారికి జనవరి 31లోగా మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈ నెల 26వ తేదీ నుంచి రైతు భరోసాతో పాటు రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 3 పథకాలను అమలు చేస్తామని తెలిపారు.

**రాజకీయాలకతీతంగా అందరికీ ఇందిరమ్మ ఇళ్లు**

రాజకీయాలకతీతంగా అందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం అపరిష్కృతంగా వదిలేసిన 1.5 లక్షల ఇళ్లను పూర్తి చేసి అర్హులకు అందిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు 80 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, ఇప్పటికే 65లక్షల మంది వివరాలను యాప్‌లో నమోదు చేశామని వెల్లడించారు. టీజీఎస్‌ఆర్టీసీని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

## శ్రీతేజ్‌ను పరామర్శించిన అల్లుఅర్జున్

**బలగం టీవి, హైదరాబాద్**

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ ను హీరో అల్లుఅర్జున్ పరామర్శించారు. మంగళవారం పోలీసుల అనుమతితో హాస్పటల్ కు వెళ్లారు బన్నీ. ప్రడ్యూసర్ దిల్ రాజుతో కలిసి ఆస్పత్రికి వెళ్లిన అల్లుఅర్జున్.. శ్రీతేజ్ తోపాటు అతని తండ్రి భాస్కర్ ను పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీతేజ్ ఆరోగ్య వివరాలను డాక్టర్ అడిగి తెలుసుకున్నారు. దాదాపు 20 నిమిషాలు ఆస్పత్రిలో ఉన్న అనంతరం అల్లుఅర్జున్ తిరిగి వెళ్లిపోయారు.

## ఫుడ్ పాయిజన్‌తో 23 మంది బాలికలకు అస్వస్థత

**బలగం టీవి, హైదరాబాద్**

కరీంనగర్ పట్టణం శర్మానగర్ లోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 23 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఇందులో 13మంది ఆస్పత్రిపాలయ్యారు. ఈ ఘటన జరిగిన పాఠశాలను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. పాఠశాలను పరిశుభ్రతగా ఉంచాలని ఆదేశించారు.

గురుకుల పాఠశాలలో సోమవారం రాత్రి క్యాబేజీ కూరతో భోజనం చేశారు. అర్ధరాత్రి వేళ విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. దీంతో ఆందోళన చెందిన సిబ్బంది ఫుడ్‌పాయిజన్ జరిగి ఉంటుందని అంచనా వేసి బాలికలను ఆస్పత్రిలో చేర్పించారు. పది మంది విద్యార్థులకు మాత్రలు ఇచ్చి పంపించేశారు. మిగిలిన 13మందికి కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవులు అందిస్తున్నారు. ఎవరికి ప్రాణాపాయ పరిస్థితి లేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి చెప్పడంతో పాఠశాల సిబ్బంది, బాలికల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

## మినీ మేడారం జాతరకు పనులను సకాలంలో పూర్తి చేయాలి : మంత్రి సీతక్క

**బలగం టీవి, ములుగు**

ఫిబ్రవరి 12 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న మినీ మేడారం జాతరకు చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి. ప్రతి పని నాణ్యతతో చేపట్టి శాశ్వతంగా నిలిచిపోయేలా ఉండాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మహా జాతర సందర్భంగా జరిగిన చిన్న చిన్న సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. రానున్న మినీ మేడారం జాతరను పురస్కరించుకొని మంగళవారం సాయంకాలం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గత పక్షం రోజులుగా భక్తులు రాక పెరిగిపోయిందని, ఫిబ్రవరి మొదటి వారం నుంచే భక్తుల తాకిడి అధికం కానున్న సందర్భంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జంపన్న వాగు వద్ద మహిళా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక షెడ్ ఏర్పాటు చేయాలని, భక్తులకు అవసరమయ్యే పనులను త్వరగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

# రోడ్డు భద్రత ప్రమాణాల పై ప్రచారం కల్పించాలి..

- రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పకడ్బంది చర్యలు..
- ప్రధాన కూడళ్లలో, అప్రోచ్ రోడ్డుల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని మంగళ వారం కలెక్టరేట్లో ఎస్పీ అఖిల్ మహజన్ తో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నిర్వహిం చారు. ఈ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆర్ అండ్ బీ రోడ్లు, పంచాయతీ రోడ్ల వద్ద ఉన్న , మున్సిపాలిటీ పరిధిలో గల ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించాలని, రోడ్లమీద వాహనాలు పార్కింగ్ చేయకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిం చారు. ప్రధాన కూడళ్లలో, అప్రోచ్ రోడ్డు ల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేనందున అధిక సంఖ్యలో ప్రమా దాలు జరుగుతున్నాయని, అలాంటి ప్రదేశాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయుటకు పార్కింగ్ స్థలాలు, ఫూట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసి సంబధిత అధికారులకు సమర్పించాలని ఆదేశించారు.

ప్రమాదాల నివారణకు ప్రస్తుతం రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, రోడ్లపై వ్యూ అంతరాయం కలగకుండా పిచ్చి మొక్కలు పూర్తిస్థాయిలో తొలగించాలని, పెద్దగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలని, ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల్లో రేడియం సైన్ బోర్డు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుతూ రావాలని, దాని కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని,జిల్లాలోని అంతర్గత ప్రాంతాల్లో జరిగే ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని రోడ్డు మరమ్మత్తు ప్రాంతాల్లో శ్రద్ధ వహించాలని, అవసరమైన చోట డివైడర్లు స్పీడ్ బ్రేకర్లు,స్పీడ్ కంట్రోల్ లైట్స్ ఏర్పాటు చేయాలని అన్నారు .

రోడ్డు భద్రతా ప్రమాణాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని,జిల్లాలో జంక్షన్ రోడ్ల వద్ద అవసరమైన స్పీడ్ బ్రేకర్, రంబల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని, సరుకు రవాణా వాహనాలు ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, జిల్లాలోని ప్రతి విద్యాసంస్థలో రోడ్డు భద్రత ప్రమాణాల పై అవగాహన కల్పించాలని అన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, త్రిబుల్ రైడింగ్, మద్యం తాగి వాహనం నడపడం, సీట్ బెల్ట్ ధరించడం మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, అతివేగం వంటివి ప్రమాదకరమని, చట్ట ప్రకారం నేరమని ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు.

జిల్లా పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ప్రతి వారం ఒకరు చనిపోతు న్నారని, దిని నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లాలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే తంగళ్ళపల్లి, తిప్పాపూర్ రోడ్, గంభీరావుపేట్, కోనరావుపేట ముస్తాబాద్, చందుర్తి, బోయినపల్లి, కోదురుపాక జంక్షన్ వంటి 13 ప్రదేశాల్లో బ్లాక్ స్పాట్ లకు గుర్తించి అక్కడ రోడ్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం రోడ్డు భద్రత మహోత్సవాల్లో భాగంగా ప్రమాద నివారణ చర్యలు సూచించే గోడ ప్రతులు, పోస్టర్లను ఆవిష్కరించినారు. ఈ సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్, ఆర్ అండ్ బీ. ఈ.ఈ. వెంకట రమణయ్య, జిల్లా రవాణా అధికారి లక్ష్మన్ , మున్సిపల్ కమిషనర్లు, లావణ్య,అన్వేష్, పి.అర్.ఈఈ సుదర్శన్ రెడ్డి , జిల్లా వైద్యాధికారి రజిత, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి పంచాక్షరి, ఆర్.టి.సి. డి.ఎంలు, నేషనల్ హైవేస్ అధికారులు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# "పోరు కన్నా ఊరు మిన్న - మన ఊరుకి తిరిగి రండి"

- ఎస్పీ అఖిల్ మహజాన్

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

అజ్ఞాతంలో ఉన్న నక్సల్స్ పోరు కన్నా ఊరు మిన్న మన ఊరికి తిరిగి రండి అనే కార్యక్రమంలో భాగంగా తంగళ్ళపల్లి మండలం గోపాలరావుపల్లె కి చెందిన యూజీ కడారి సత్యనారాయణ కుటుంబ సభ్యులను జిల్లా ఎస్పీ అఖిల్ మహజాన్ వారి ఊరులోని ఇంటి వద్ద కలిసిపండ్లు అందించి కుటుంబ సభ్యుడు అయిన యూజీ కడారి సత్యనారాయణ అలియాస్ కోస అలియాస్ సాడు సరెండర్ అయి జన జీవన స్రవంతి కలవటంతో వారి సహాయ సహకారాలు అందిస్తామని వారిలో స్ఫూర్తి నింపి ప్రభుత్వం అందించే పునరావాసం ఇతర సదుపాయాలు మొదలైన వాటి గురించి కుటుంబ సభ్యులకు వివరించారు.



# ఆడబిడ్డల పెళ్లిలకు కళ్యాణలక్ష్మీ వరం

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని రాజాప్రపుల్ల రెడ్డి పంక్షన్ హాల్ లో నిర్వహించిన కళ్యాణలక్ష్మి,షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులు హాజరయ్యి చెక్కుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నిరుపేదల ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి, షాది ముబారక్ కొండంత అండగా నిలిచిందని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి లకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు, ఏఎంసి ఛైర్మన్ స్వరూప,వైస్ ఛైర్మన్ నర్సింగం గౌడ్, తహశీల్దార్ జయంత్ ,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్, డైరెక్టర్లు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# విద్యాలయాల ఆవరణలో స్వచ్ఛత పనులు చేపట్టాలి..




- ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

ప్రతి గ్రామం శుభ్రంగా ఉండేలా పరిశుభ్రత పనులు చేయించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వచ్ఛత, పరిశుభ్రత తదితర అంశాలపై జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు,ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ

ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి నిత్యం ఉదయం 9 గంటలకు కార్యాలయంలో అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామంలో ఎక్కడా నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, మురికి కాలువలు లేని చోట కమ్యూనిటీ సోక్ పిట్ నిర్మించాలని ఆదేశించారు. తాగు నీరు సరఫరాలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. పైప్ లైన్ లలో ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే సరి చేయించాలని, ప్రతి రోజూ గ్రామాల్లో సేకరించే చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి, సెగ్రిగేషన్ చేయించాలని,కంపోస్టు ఎరువు తయారు చేసి విక్రయించాలని అన్నారు . ఇంకా ఎక్కడైనా వ్యక్తిగత మరుగు దొడ్లు నిర్మించుకొని వారు ఉంటే వారికి పూర్తి చేయాలని,జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇంటి ఇతర పన్నులు 100 శాతం వసూలు చేయాలని ఆదేశించారు.

**విద్యాలయాల పై ప్రత్యేక దృష్టి**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాలయాలు, హాస్టళ్లు, అంగన్వాడి కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యాలయాల ఆవరణలో చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలని, చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించాలని సూచించారు. ప్రతి విద్యాలయానికి నిత్యం నీరు సరఫరా అయ్యేలా చూడాలని,నిత్యం పారిశుధ్య పనులు చేయించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్సో జిల్లా పంచాయతీ అధికారి శేషాద్రి, డీఎల్పీఓ నరేష్, ఎస్బీఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆక్రమణకు గురైన 3 ఎకరాల ప్రభుత్వ భూమి అప్పగింత..

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆక్రమణకు గురైన మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన సంచుల కుమారస్వామి తిరిగి ప్రభుత్వానికి అప్పగించడం జరిగిందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు . మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం లో ప్రభుత్వ భూమి అప్పగింత పై ఎస్పీ అఖిల్ మహజన్ తో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ తంగళ్ళపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన సంచుల కుమారస్వామి గ్రామ సర్వే నెంబర్ 464లో గల 3 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసుకుని సాగు చేసుకుంటున్నాడని ప్రభుత్వానికి తిరిగి అప్పగించడానికి నిర్ణయించారని అన్నారు. జిల్లాలో ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడి ఉంటే సదురు భూమిని ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించాలని, ఈ భూములను పేద ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తామని, పేద ప్రజలకు ఇంటి పట్టాల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు వినియోగిస్తామని అన్నారు. 2018 నుంచి 2023 వరకు ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉంటూ రైతు బంధు, పీఎం కిసాన్ మొదలైన ప్రభుత్వ పథకాలు లబ్ది పొందినందుకు ఆ సొమ్ము రికవరి కోసం డిమాండ్ నోటీసు జారీ చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటిదాకా దాదాపు 250 ఎకరాలు ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ప్రేమజంట ఆత్మహత్య కేసు.. నిందితుడు అరెస్ట్

- బ్లాక్‌మెయిల్ చేయడంతో కారులో నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న జంట



**బలగం టీవీ , హైదరాబాద్**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి బ్లాక్‌మెయిల్‌కు భయపడి ప్రేమజంట.. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో సోమవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

నిందితుడిని చింటూ యాదవ్ అలియాస్ చింటూగా పోలీసులు గుర్తించారు. చింటూ స్వస్థలం మక్తా. చింటూను విచారించేందుకు పోలీసులు పీఎస్‌కు తరలించారు. ప్రేమజంట ఆత్మహత్య కేసులో ఇంకా ఇంకెవరి ప్రమేయమైనా ఉందా..? అన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జమిలాపేట్‌కు చెందిన పర్వతం శ్రీరామ్(25) పోచారం మున్సిపాలిటీ నారపల్లి సమీపంలో సైకిల్ రిపేరింగ్ షాపు నడుపుతున్నాడు. అతనికి అక్కడే ఉంటున్న ఓ బాలికతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఈ విషయం బాలిక బంధువు, మక్త గ్రామానికి చెందిన చింటూకు తెలిసింది. అతను వారిని డబ్బులు ఇవ్వాలని, లేకుంటే ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్తానని బెదిరించాడు. చేసేది లేక శ్రీరామ్ తన దగ్గర ఉన్న రూ.1.35 లక్షలు, బాలిక గోల్డ్‌రింగ్ ఇచ్చారు. అయినప్పటికీ వదలకపోవడంతో ప్రేమికులిద్దరూ చనిపోదామనుకున్నారు. సోమవారం శ్రీరామ్ తన స్నేహితుడు నవీన్ కారును అడిగి తీసుకొచ్చాడు. అందులో ప్రేమికులిద్దరూ కలిసి సాయంత్రం ఘనపూర్ ఓఆర్ఆర్ వద్దకు వెళ్లి వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను కారులోపల పోసి నిప్పంటించుకున్నారు.

# మూడో ప్లేస్‌కు భారత జట్టు



**బలగం టీవి, హైదరాబాద్**

ఇటీవలే జరిగిన బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో ఆతిథ్య ఆస్ట్రేలియా చేతిలో 1–3 తేడాతో ఓటమి పాలైన టీమ్ ఇండియా ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో 3వ స్థానానికి దిగజారింది. ఈ క్రమంలో 9 ఏళ్ల తర్వాత ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్?లో టాప్–2 నుంచి భారత్ నిష్క్రమించి మూడో స్థానానికి పరిమితమైంది. అయితే ఆడిన చివరి 8 టెస్టు మ్యాచ్‌ల్లో భారత్ ఏకంగా ఆరింటిలో ఓటమి పాలవ్వడం వల్ల డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుకోలేకపోయింది. ఇదిలా ఉండగా, సౌతాఫ్రికా జట్టు వరుసగా ఏడు టెస్టు మ్యాచ్ విజయాలు సాధించడం వల్ల ఆ జట్టు ర్యాంక్ మెరుగుపడడానికి దోహదపడింది. తాజాగా పాకిస్థాన్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో దక్షిణాఫ్రికా 2–0తో గెలవడం వల్ల ఆ జట్టు రెండో స్థానానికి చేరుకుంది. 112 రేటింగ్ పాయింట్లతో సౌతాఫ్రికా ఇప్పుడు భారత్?ను వెనక్కి నెట్టి రెండో స్థానానికి చేరుకుంది. 126 రేటింగ్ పాయింట్లతో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో నిలిచింది. 112 రేటింగ్ పాయింట్లతో సౌతాఫ్రికా రెండో స్థానంలో ఉంది. 2016 తర్వాత తొలిసారిగా 109 రేటింగ్ పాయింట్లతో టెస్టు టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్ మూడో స్థానానికి దిగజారింది. 106 పాయింట్లతో ఇంగ్లాండ్ నాలుగో స్థానంలో, 96 పాయింట్లతో న్యూజిలాండ్ ఐదో స్థానంలో కొనసాగుతున్నాయి. 87 పాయింట్లతో శ్రీలంక ఆరో స్థానంలో ఉంది. పాకిస్థాన్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, ఐర్లాండ్ ఆ తర్వాతి వరుస స్థానాల్లో నిలిచాయి.

## గేమ్ ఛేంజర్ నుంచి ‘అలికి పూసిన అరుగు మీద’




**బలగం టీవి, హైదరాబాద్**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ గేమ్ ఛేంజర్ ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. దిగ్గజ దర్శకుడు శంకర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తున్నాడు.ే తాజాగా ఈ మూవీ నుంచి మెలోడి సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. ”అలికి పూసిన అరుగు మీద కలికి సుందరినై కూసుంటే పలకరించవేంది ఓ దొర. చిలక ముక్కు చిన్ని నా దొరా”. అంటూ ఈ మెలోడి ఉండగా.. రామ్ చరణ్ అంజలిపై ఈ పాటను చిత్రీకరించినట్లు తెలుస్తుంది. ఈ పాటకు కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించగా.. థమన్, ఎస్ రోషిని జేకెవీ కలిసి పాడారు. థమన్ సంగీతం అందించాడు.






## ఆస్కార్స్ ఉత్తమ చిత్రం కేటగిరీలో ఐదు భారతీయ సినిమాలు

**బలగం టీవి, హైదరాబాద్**

97వ అకాడమీ అవార్డ్స్ ఈవెంట్ కు కేవలం రెండు నెలల సమయం ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ఈ ఏడాది ఆస్కార్‌లకు అర్హత సాధించిన 323 చలన చిత్రాల జాబితాను ప్రకటించింది. వీటిలో 207 సినిమాలు ప్రతిష్టాత్మకమైన ఉత్తమ చిత్రం కేటగిరీలో అర్హత సాధించాయి. ఈ జాబితాలో ఐదు భారతీయ సినిమాలు అర్హత సాధించడం విశేషం. భారతీయ సినిమాల జాబితా: కంగువ (తమిళం), ఆడుజీవితం (ది గోట్ లైఫ్)–హిందీ, సంతోష్ (హిందీ), స్వతంత్ర్య వీర్ సావర్కర్ (హిందీ) All We Imagine as Light ( మలయాళం–హిందీ), Girls will be Girls (హిందీ–ఇంగ్లీష్)

ఈ నామినేషన్లకు ఓటింగ్ రేపటి నుంచి షురూ కానుంది. ఈ ప్రక్రియ జనవరి 12 వరకు ముగియనుంది. అకాడమీ ఫైనల్ నామినేషన్స్‌ను జనవరి 17న ప్రకటించనుంది. 97వ ఆస్కార్ అవార్డ్ ఈవెంట్–2025 మార్చి 2న Ovation Hollywoodలోని డాల్బీ థియేటర్‌లో జరుగనుంది. మరి ఈ జాబితా నుంచి ఏ సినిమా అయినా ఫైనల్ నామినేషన్‌లో చోటు సంపాదించుకుంటుందా..? అని భారతీయ సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## ‘స్పైడర్ మ్యాన్’ ఎంగేజ్మెంట్..!


**బలగం టీవి, హైదరాబాద్**

‘స్పైడర్ మ్యాన్’ స్టార్ కపుల్ టామ్ హాలండ్ , జెండయా సీక్రెట్ గా నిశ్చితార్థం చేసుకుని అందరికీ షాక్ ఇచ్చారు. 2025 గోల్డెన్ గ్లోబ్స్‌లో జెండయా తన వేలికి ఎంగేజ్మెంట్ డైమండ్ రింగ్ తో కన్పించగా, ఈ వార్త వెలుగులోకి వచ్చింది. ఆదివారం రాత్రి లాస్ ఏంజిల్స్‌లో జరిగిన 82వ గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో జెండయా ఉత్తమ నటిగా ఎంపికైంది. సమాచారం ప్రకారం ‘స్పైడర్ మ్యాన్’ స్టార్ టామ్ క్రిస్మస్ సందర్భంగా జెండయాకు ప్రపోజ్ చేశాడు. ఆ సమయంలో జెండాయా కుటుంబం కూడా అక్కడే ఉన్నట్టుగా తెలుస్తోంది. టామ్ మోకాలిపై కూర్చొని, ఆమె కుటుంబం ముందు సినిమా స్టైల్ లో జెండయాకు ప్రపోజ్ చేసినట్టు తెలుస్తోంది. ఆమె కూడా వెంటనే ఒకే చెప్పడంతో అక్కడిక్కడే ఎంగేజ్మెంట్ కూడా జరిగిపోయిందట. నిజానికి ఈ జంట చాలా కాలంగా లివ్ ఇన్ రిలేషన్షిప్ లో ఉన్నారు.

మెగా షో రెడ్ కార్పెట్ పై ఓ మీడియా రిపోర్టర్ ఆమెను రింగ్ గురించి ప్రశ్నించగా.. జెండాయ సూటిగా సమాధానం చెప్పలేదు. ఆమె సిగ్గు పడుతూ నవ్వి, భుజాలు ఎగరేస్తూ సైలెంట్ గా అక్కడి నుంచి వెళ్ళిపోయింది. దీంతో నిశ్చితార్థం జరిగిందనే పుకార్లు మొదలయ్యాయి. ఈ జంట తమ బంధం గురించి ఎప్పుడు బయట పెడతారా అని ఆతృతగా ఎదురు చూస్తున్నారు అభిమానులు. జెండయా – టామ్ హాలండ్ నిశ్చితార్థం గురించి రూమర్స్ రావడం ఇదే మొదటిసారి కాదు. 2022లో కూడా ఇలాగే వార్తలు రాగా, జెండయా స్పందిస్తూ తన నిశ్చితార్థం జరిగితే తప్పకుండా అందరికీ చెబుతానని చెప్పి ఈ పుకార్లపై క్లారిటీ ఇచ్చింది.

## రిపోర్టర్‌పై రజనీ కాంత్ అసహనం

**బలగం టీవి, హైదరాబాద్**



సూపర్ స్టార్ రజనీకాంత్ తాజాగా ఓ రిపోర్టర్‌పై అసహనం వ్యక్తం చేశారు. అసంబద్ధమైన ప్రశ్నలు అడగవద్దంటూ కోరారు. తనను రాజకీయంగా ఎటువంటి ప్రశ్నలకు అడగొద్దని అన్నారు.

రజనీ ప్రస్తుతం ‘కూలీ’ సినిమా షెడ్యూల్‌తో బిజీ బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో ఆయన తాజాగా అప్‌కమింగ్ షూటింగ్ కోసం థాయిలాండ్ వెళ్లారు. ఆ సమయంలో ఎయిర్‌పోర్ట్‌లో మీడియాతో ముచ్చటించారు. వారు ఆయన్ను సినిమా అప్‌డేట్స్‌తో పాటు పలు ప్రశ్నలు అడిగారు. ఇటీవల చెన్నైలోని అన్నా యూనివర్సిటీలో 19 ఏళ్ల విద్యార్థినిపై లైంగిక వేధింపుల ఘటన అక్కడ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో ‘సమాజంలో మహిళల భద్రత’ గురించి ఓ విలేకరి ప్రశ్నించగా, దానికి ఆయన అసంబద్ధమైన ప్రశ్నలు వేయొద్దని కోరారు. రాజకీయాలకు సంబంధించిన ప్రశ్నలు తనను అడగవద్దని స్పందించారు.

ఇదిలా ఉండగా, ఇదే వేదికగా ‘కూలీ’ మూవీ అప్‌డేట్‌ను కూడా పంచుకున్నారు. షూటింగ్ దాదాపు 70 శాతం పూర్తయిందని తెలిపారు. అయితే జనవరి 13 నుంచి 28 వరకు మరో షెడ్యూల్ జరగనుందని పేర్కొన్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను పంచుకుంటామని అన్నారు.




## ఛాంపియన్స్ ట్రోఫీలో ఆఫ్ఘనిస్తాన్‌తో ఆడొద్దు..

- **ఈసీబీని కోరిన ఇంగ్లండ్ ఎంపీలు**

**బలగం టీవి, హైదరాబాద్**

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీవచ్చే నెల నుండి జరగనుంది. పాకిస్తాన్, యూఏఈ వేదికగా ఫిబ్రవరి 19 నుండి మార్చి 9 వరకు 8 జట్ల మధ్య ఈ పోరు జరగబోతోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ వివాదం తెరమీదకు వచ్చింది. ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నీలో ఆఫ్ఘనిస్తాన్‌తో మ్యాచ్ ఆడవద్దు అని ఇంగ్లండ్ రాజకీయవేత్తలు తీర్మానించారు. సుమారు 160 మంది ఎంపీలు ఓ లేఖపై సంతకం చేశారు. మహిళల హక్కులపై ఆంక్షలు విధిస్తున్న తాలిబన్ ప్రభుత్వ ఆగడాలను అడ్డుకునేందుకు ఈ చర్య తీసుకోవాలని రాజకీయవేత్తలు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డును కోరారు.

2021లో తాలిబన్ నేతలు తిరిగి అధికారంలోకి వచ్చినప్పటినుండి ఆ దేశంలో మహిళలపై అడ్డగోలు ఆంక్షలు విధిస్తున్న విషయం తెలిసిందే. మహిళలను కేవలం వంటింటికే పరిమితం చేసేశారు. బయటకు వస్తే కచ్చితంగా బుర్ఖా ధరించాలని హుకుం జారీ చేశారు. అంతేకాదు భర్త లేదా అన్న ఎవరైనా తోడుగా ఉంటేనే బయటకు రావాలని ఆంక్షలు విధించారు. ఇక అక్కడ స్కూల్లలో చదివే విద్యార్థినులు ఆరవ గ్రేడ్ మించి చదవకూడదు, ఆడవాళ్లు ఉద్యోగాలు చేయకూడదు, జిమ్ లేదా పబ్లిక్ పార్కుల్లో మహిళలు కనిపించడం నిషేధం. మహిళల నోట క్రికెట్ అనే మాట వినపడకూడదు. మహిళలు పాల్గొనే అన్ని క్రీడలను అక్కడ నిషేధించారు. మహిళా క్రికెట్ ని కూడా తాలిబన్ ప్రభుత్వం నిషేధించింది. అయితే ఈ ఆంక్షలను బ్రిటిష్ రాజకీయ నేతలు ఖండిస్తున్నారు. స్త్రీలకు విలువ లేని తాలిబన్ దేశానికి చెందిన ఆఫ్ఘనిస్తాన్ జట్టుతో క్రికెట్ ఆడకూడదని యూకే రాజకీయ నేతలు ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డ్ (ఈసీబీ) ని కోరారు. ఏకంగా 160 మంది యూకే రాజకీయ నాయకులు సంతకం చేసిన లేఖను ఈసీబీకి అందజేశారు. ఆఫ్ఘనిస్తాన్ తో తమ ఇంగ్లాండ్ జట్టు మ్యాచ్ ని బహిష్కరించాలని, ఈ మేరకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కూడా ఓ స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

ఇక ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) సీఈఓ రిచర్డ్ గౌల్డ్ ఈ అంశంపై స్పందిస్తూ.. మహిళల హక్కుల పట్ల తాలిబన్ ప్రవర్తనను ఖండిస్తున్నామని తెలిపారు. ఐసీసీ నియమావళి ప్రకారం మహిళా క్రికెట్ ని ప్రోత్సహించడం సభ్య దేశాల బాధ్యత అని తెలిపారు. ఈ మ్యాచ్ బహిష్కరించాలని ఇంగ్లాండ్ రాజకీయవేత్తలు తీర్మానించారు. అయితే ఇంగ్లాండ్ పొలిటీషియన్లు ఈసీబీకి రాసిన లేక పై ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. ఫిబ్రవరి 26వ తేదీన లాహెూర్ వేదికగా ఆఫ్గనిస్తాన్ –ఇంగ్లాండ్ మధ్య ఈ మ్యాచ్ జరగనుంది. గతంలో కూడా ఓసారి ఇలాంటి నిర్ణయం తీసుకుంది ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు. 2003 క్రికెట్ ప్రపంచ కప్ లో రాబర్ట్ ముగాబే పాలనకు నిరసనగా జింబాబ్వే తో జరగబోయే మ్యాచ్ ని ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు బహిష్కరించింది.

## రోహిత్, కోహ్లి కమ్‌బ్యాక్ ఇస్తారు

- **మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్**



**బలగం టీవి, హైదరాబాద్**

విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఫామ్ లో లేకపోవడం భారత జట్టుకు అతిపెద్ద సమస్యగా మారింది. న్యూజిలాండ్ చేతిలో వైట్ వాష్, బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ లో ఘోర పరాభవం తర్వాత ఈ ఇద్దరిపై పలువురు మాజీ క్రికెటర్లు, కామెంటేటర్లు విమర్శలు గుప్పిస్తున్నారు. జట్టు నుంచి తప్పుకోవాలంటూ మండిపడుతున్నారు. అయితే, తాజాగా టీమ్ఇండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ ఈ ఇద్దరి గురించి కీలక వ్యాఖ్యలు చేశాడు.

“నావరకూ ఈ బోర్డర్–గావస్కర్ ట్రోఫీ సిరీస్ ఓటమి కంటే న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ కోల్పోవడమే బాధాకరం. ఎందుకంటే స్వదేశంలో 0–3తో వైట్‌వాష్ అయింది. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఆస్ట్రేలియాలో గత రెండుసార్లు భారత్ గెలిచింది. కానీ ఈసారి ఓడింది. గొప్ప ప్లేయర్లైన విరాట్, రోహిత్‌లపై కామెంట్ చేస్తున్నారు. వారి గురించి చెడుగా మాట్లాడుతున్నారు. ఆ ఇద్దరూ గతంలో ఏం సాధించారో ప్రజలదంరూ మర్చిపోయారు. ఈ కాలపు గొప్ప క్రికెటర్లలో రోహిత్, కోహ్లి కూడా ఉంటారు. టీమ్ఇండియా ఓడింది. వారిద్దరూ బాగా పెర్ఫామ్ చేయలేకపోయారు. అందుకు వారు మనకంటే ఎక్కువగానే బాధ పడుతున్నారు. కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, రోహిత్, విరాట్, బుమ్రాలకు మంచి క్రికెట్ మైండ్ ఉంది. ఫ్యూచర్‌లో భారత క్రికెట్ ఎలా ముందుకుసాగాలో వారే డిసైడ్ అవ్వాలి. బాగా ఆడకపోతే కెప్టెన్ స్వయంగా జట్టు నుంచి బయటకువెళ్లడం గతంలో నేనెప్పుడూ చూడలేదు. తనకంటే జట్టు ప్రయోజనాలే ముఖ్యమంటూ రోహిత్ ఆ డెసిషన్ తీసుకున్నాడు. ఇది అతడి గొప్పతనం. ఓడినా, గెలిచినా సరే అతను ఓ గొప్ప కెప్టెన్. రోహిత్ నాయకత్వంలోనే వన్డే ప్రపంచ కప్ వరకు వెళ్లాం. టీ20 ప్రపంచకప్ కూడా సాధించాం. ఇంకా ఎన్నో కూడా గెలుచుకున్నాం. ప్లేయర్స్ సరిగ్గా ఆడనప్పుడు వారి గురించి చెడుగా చెప్పడం సులభం. కానీ వారికి సపోర్ట్‌గా నిలవడం చాలా కష్టం. వారి గురించి చెడుగా మాట్లాడటమే మీడియా పని. రోహిత్, విరాట్ నా ఫ్యామిలీ లాంటి వారు. నా కుటుంబం, సోదరులకు మద్దతుగా నిలవడం నా విధి. రోహిత్ విరాట్ కమ బ్యాక్ ఇస్తారు ’ అని అన్నారు.